క్లుప్తంగా

కోరం లేక సర్వసభ్య సమావేశం వాయిదా


సమావేశంలో సభ్యుల కోసం వేచి ఉన్న అధికారులు

కొండపి: కోరం లేకపోవడంతో మండల సమావేశాన్ని వాయిదా వేసినట్లు ఎంపీడీఓ రామాంజనేయులు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సర్వసభ్య సమావేశం జరగాల్సి ఉండగా..కేవలం ఒక సభ్యుడు మాత్రమే హాజరు కావడంతో గురువారానికి వాయిదా వేసినట్లు చెప్పారు. గురువారం జరిగే సమావేశానికి అన్ని శాఖ అధికారులు పూర్తి సమాచారంతో రావాలని, సభ్యులంతా సమావేశానికి హాజరు కావాలని ఆయన కోరారు

రాజ్యాంగ విశిష్టతపై అవగాహన అవసరం


చిర్రికూరపాడు ఉన్నత పాఠశాలలో మాక్ పోలింగ్

జరుగుమల్లి(సింగరాయకొండ): భారత రాజ్యాంగం విశిష్టమైందని, దీన్ని రచించిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చిందని ఎంఈఓ బి.నాగేంద్రవదన్ అన్నారు. మండలంలోని చిర్రికూరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని మాక్ పోలింగ్ నిర్వహించి విద్యార్థులకు ఎన్నిక జరిగే విధానంపై అవగాహన కల్పించారు. పోలింగ్‌లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ఓటరుగా, ఎన్నికల అధికారులుగా విధులు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు అనూరాధ, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకునికి గాయాలు


సూరారెడ్డిపాలెం వద్ద గాయపడిన వ్యక్తి

టంగుటూరు: లారీ ఢీకొట్టడంతో యువకునికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని సూరారెడ్డిపాలెం జాతీయ రహదారిపై బుధవారం జరిగింది. జాతీయ రహదారి పోలీసులు తెలిపిన వివరాల మేరకు..జరుగుమల్లి మండలం వావిలేటిపాడు గ్రామానికి చెందిన ద్విచక్ర వాహనదారుడు సిసింద్ర గ్రామం నుంచి ఒంగోలు వెళుతుండగా సూరారెడ్డిపాలెం సమీపంలో రాంగ్ రూట్‌లో వేగంగా వచ్చిన లారీ ఢీకొట్టడంతో గాయాలయ్యాయి. క్షతగాత్రున్ని చికిత్స నిమిత్తం జాతీయ రహదారి అంబులెన్సులో ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంలో ద్విచక్రవాహనం దెబ్బతింది.

సీనియర్ జర్నలిస్టు రవికుమార్ మృతిపై సంతాపం

కందుకూరు: సీనియర్ జర్నలిస్టు రవికుమార్ మృతిపై పలువురు జర్నలిస్టు సంఘాల నాయకులు బుధవారం ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. వలేటివారిపాలెం మండలానికి చెందిన సీహెచ్ రవికుమార్ బుధవారం ఇంటి వద్ద గుండెపోటుకు గురై ఆకస్మాత్తుగా మృతి చెందారు. రవికుమార్ 20 ఏళ్ల పాటు విశాలాంధ్ర, ప్రజాశక్తి, హైదరాబాద్ మిర్రర్, సూర్య వంటి దినపత్రికల్లో జర్నలిస్టుగా పనిచేశారు. ఈ నేపథ్యంలో రవికుమార్ ఆకస్మిక మృతిపై సామ్నా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.బాలకోటయ్య తన సంతాపం వ్యక్తం చేశారు. కందుకూరుకు చెందిన ఆనందమోహన్, ద్రోణాదుల చైతన్య, బొజ్జా చంద్రమోహన్, బూసి సురేష్‌బాబు, అంజయ్య తమ సంతాపం వ్యక్తం చేశారు.

ప్రయాణం.. నరకప్రాయం

- రోడ్డు మలుపుల దగ్గర భారీగా గుంతలు
- తరచూ మలుపుల వద్ద ప్రమాదాలు
- అప్రమత్తంగా లేకుంటే ప్రమాదాలే
- గుంతలు పూడ్చాలని వాహనదారుల విజ్ఞప్తి


సింగరాయకొండ ఉత్తర బైపాస్ రోడ్డు మలుపు వద్ద గుంతలు


కందుకూరు ఫ్లైఓవర్ వద్ద కోసుకుపోయిన రోడ్డు మార్జిన్లు

సింగరాయకొండ: మండలంలో ముఖ్యమైన రహదారుల్లో భారీ గుంతలు ప్రమాదభరితంగా మారాయి. ఇటీవల కురిసిన వర్షాలకు ఈ గుంతల్లో నీరు నిలిచి మరింత పెద్దవి కావడంతో వాహనదారులకు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. రాత్రిళ్లు ఈ గుంతల్లో వాహనాలు పడి ప్రమాదాలు జరిగిన సంఘటనలూ ఉన్నాయి. వాహనదారులు ఈ ప్రాంతంలో ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా ప్రమాదాలకు గురవుతున్నారు. మండల కేంద్రంలోని బాలయోగినగర్, ఉత్తర బైపాస్ రోడ్ మలుపు దగ్గర, కందుకూరు ఫ్లైఓవర్ సమీపంలో, తహసీల్దార్ కార్యాలయ సమీపంలోని ఓవీరోడ్డుపై గుంతలు పడి రాకపోకలకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రమాదభరితంగా ఉన్న గుంతలు పూడ్చి ఇబ్బందులు తీర్చాలని వాహనదారులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.


తహసీల్దార్ కార్యాలయం సమీపంలో అధ్వానంగా ఓవీ రోడ్డు


బాలయోగినగర్ జంక్షన్‌లో పెద్ద పెద్ద గుంతలు


అధ్వానంగా కలికవాయ-నందనవనం రోడ్డు

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం


కనిగిరిలో మాట్లాడుతున్న చైర్మన్ అబ్దుల్ గఫార్


సింగరాయకొండలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, ఉపాధ్యాయులు


లక్ష్మీనరసాపురంలో అవగాహన ర్యాలీ

సింగరాయకొండ: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, బాల్య వివాహాలను ప్రోత్సహిస్తే వారిపై క్రిమినల్ కేసులు బనాయిస్తామని ఎంపీడీఓ డి.జయమణి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో బుధవారం సాయంత్రం బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డిప్యూటీ తహశీల్దార్ ముస్తాక్ మాట్లాడుతూ నేటి సమాజంలో బాలికలు బాల్య వివాహాలతో ఎన్నో అనర్థాలు జరుగుతున్నాయన్నారు. అనంతరం బాల్య వివాహాలను అరికడతామని ప్రతిజ్ఞ చేసి తరువాత పోలీస్‌స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పామూరు: బాల్య వివాహాల నియంత్రణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎంఈఓ గరికపాటి కరుణకుమారి అన్నారు. మండలంలోని లక్ష్మీనరసాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం స్వయంకృషి స్వచ్ఛంద సేవాసంస్థ అధ్యక్షుడు షేక్.నాయబ్‌రసూల్ ఆధ్వర్యంలో పాఠశాల హెచ్ఎం సయ్యద్ ఇసాక్ అధ్యక్షతన బాల్యవివాహాల వల్ల అనర్థాలు, నియంత్రణపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ కరుణకుమారి మాట్లాడుతూ బాలురకు 21 ఏళ్లు, బాలికలకు 18 ఏళ్లు నిండిన తర్వాతే వివాహాలు చేయాలన్నారు. బాలికల అక్రమరవాణా నియంత్రలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. ఎక్కడైనా బాలికల అక్రమ రవాణా సమాచారం తెలిస్తే ఐసీడీఎస్, పోలీసులకు తెలియజేయాలన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జరుగుమల్లి(సింగరాయకొండ): బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎంఈఓ బి. నాగేంద్రవదన్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్య వివాహాలను అడ్డుకుంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించి ర్యాలీ నిర్వహించారు. ఇన్‌చార్జి ఎస్సై ఫిరోజ్, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కనిగిరి రూరల్: బాల్య వివాహాల నిర్మూలన అందరి బాధ్యతని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. స్థానిక సమీకృత బాలికల వసతి గృహంలో బాల్ వివాహ్ ముక్త్ భరత్ ప్రచారంలో భాగంగా మండల న్యాయ సేవాధికార సంస్థ, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. కనిగిరి న్యాయవాదుల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యరజాల బాలనారాయణ మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, జరిగే నష్టాలు, బాల్య వివాహ నిషేధిత చట్టం, 2006పై అవగాహన కల్పించారు. వసతి గృహ సంక్షేమ అధికారులు చంద్రకుమారి, జయంతి, పారాలీగల్ వలంటీర్లు మంద్రు రమేష్‌బాబు, న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులు సస్యరక్షణ చర్యలు పాటించాలి

కనిగిరిరూరల్: వ్యవసాయ, ఉద్యానవన రైతులు సస్యరక్షణ చర్యలు, మేలైన యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడులు పొందాలని ఉద్యాన శాఖాధికారి ఎం అంజలిభాయి, వ్యవసాయ అధికారి పి.జోత్స్నాదేవి అన్నారు. మండలంలోని చినఅలవలపాడు, తక్కెళ్లపాడు గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది నిర్వహించారు. పంటల బీమా పథకం గురించి వివరించారు. వివిధ శాఖల అధికారులు రేష్మా, కరిముల్లా, ఎస్‌కే నూరిన్నిసా, స్థానిక రైతు నాయకులు పాల్గొన్నారు.

కొండపి: మండలంలోని ముప్పవరం, చోడవరం గ్రామాల్లో వ్యవసాయాధికారి డి.విజయకుమార్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఏఈఓ పి.కుమార్, గ్రామ వ్యవసాయ సహాయకులు డి.ఆదినారాయణ, రైతులు పాల్గొన్నారు.

టంగుటూరు: శనగ పూత దశలో పొటాషియం నైట్రేట్ పిచికారీ చేసుకోవాలని వ్యవసాయాధికారి స్వర్ణలత సూచించారు. మండలంలోని జమ్ములపాలెం, కాకుటూరివారిపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది నిర్వహించారు. రైతులకు రాయితీపై శనగ విత్తనాలు పంపిణీ చేశారు.

పామూరు: రైతులు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకంకింద వారి పంటల సాగు వివరాలను సీఎస్‌సీ సెంటర్‌లలో నమోదు చేయించుకోవాలని వ్యవసాయాధికారి కంచం రాధ తెలిపారు. మండలంలోని తూర్పు కట్టకింద పల్లె, రేగిచెట్లపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది నిర్వహించారు. వీఏఏ బాలక్రిష్ణ, యామిని, ఏహెచ్ఏ, గ్రామ రైతులు పాల్గొన్నారు.


పొలం పిలుస్తోందిలో వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు


మాట్లాడుతున్న వ్యవసాయాధికారి విజయ్‌కుమార్

మద్దిపాడు: మండలంలోని సన్నమూరు, అంకేపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది నిర్వహించారు. వ్యవసాయాధికారి సీహెచ్ వెంకటేష్ రైతులకు అవగాహన కల్పించారు. సర్పంచ్ తిరుపతమ్మ భాస్కర్ రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి బలరాం, కిషోర్, రాయుడు, గ్రామ వ్యవసాయ సహాయకుడు ఈర్ల చిన్నబాబు పాల్గొన్నారు.

సీఎస్‌పురం(పామూరు): రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలని ఏడీఏ వెంకటరమణ అన్నారు. మండలంలోని దర్శిగుంట్ల, అంబవరం కొత్తపల్లి గ్రామాల్లో బుధవారం ఏఓ బి.సంపత్‌కుమార్ అధ్యక్షతన పొలం పిలుస్తోంది నిర్వహించారు. వరి పైరును పరిశీలించి పాముపొడ తెగులు ఆశించినట్లు గుర్తించి నివారణకు సూచనలు చేశారు. సర్పంచ్ వెంకటయ్య, ఏఈఓ పావలి శ్రీనివాసులు, రైతుసేవా కేంద్రం సిబ్బంది పి.వెంకట అనూష, ఎం వెంకటేశ్వర్లు, పి.రవి, రైతులు పాల్గొన్నారు.

జరుగుమల్లి(సింగరాయకొండ): మండలంలోని వర్ధినేనివారిపాలెం, ఎన్‌ఎన్ కండ్రిక గ్రామాల్లో పొలం పిలుస్తోంది నిర్వహించారు. వ్యవసాయాధికారి యుగంధర్ రైతులకు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం గురించి వివరించారు. ఏఏఓ శ్రీలేఖ, పలు శాఖల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో ప్రయాణించి బహుమతులు పొందండి


ప్రయాణికులకు లక్కీడిప్ గిఫ్ట్‌ను అందచేస్తున్న డీఎం సయనా బేగం

కనిగిరిరూరల్: ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో సురక్షిత ప్రయాణం చేసి, బహుమతులను పొందాలని ఆర్టీసీ డీఎం మహ్మద్ సయనా బేగం అన్నారు. స్థానిక ఆర్టీసీ డిపోలో బుధవారం ప్రయాణికులకు లక్కీ డిప్ తీసి గిఫ్టులు అందచేశారు. ఈ సందర్భంగా డీఎం మహ్మద్ సయనా బేగం మాట్లాడుతూ పామూరు, సీఎస్‌పురం రూట్‌లలో ప్రయాణించే ప్రయాణికులు లక్కీ డిప్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సీఎంఆర్ జ్యూవెలరీ ఒంగోలు వారి సౌజన్యంతో ఆకర్షణీయమైన బహుమతులు అందిస్తున్నామన్నారు. అసిస్టెంట్ మేనేజర్ ఏవీ రమణమ్మ, ఏడీసీలు, డ్రైవర్లు, కండక్టర్లు, ప్రయాణికులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

పామూరు: రక్తదానం ప్రాణదానంతో సమానమని సూర్యచంద్ర సేవాసంస్థ అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ డీవీ మనోహర్ అన్నారు. స్థానిక ఏకలవ్య నగర్‌కు చెందిన గంగమ్మ అనే మహిళకు అత్యవసరంగా అరుదైన ఓ నెగటివ్ రక్తం అవసరం కావడంతో సంస్థను సంప్రదించారు. ఈసందర్భంలో మండల హౌసింగ్ ఇన్‌చార్జ్ ఏఈ బి.రాజమోహన్‌రెడ్డికి సమాచారం ఇచ్చి స్థానిక ప్రజావైద్యశాలలో అతని నుంచి రక్త సేకరణ చేసి ఆపదలో ఉన్న మహిళకు రక్తం ఇప్పించారు. రక్తదాత రాజమోహన్‌రెడ్డికి అభినందనలు తెలిపారు. రాగిపాటి సుధాకర్, మస్తాన్ ఉన్నారు.


రక్తదానం చేస్తున్న హౌసింగ్ ఇన్‌చార్జ్ ఏఈ రాజమోహన్‌రెడ్డి

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన దద్దాల


వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో దద్దాల, ఇతర నేతలు

కనిగిరిరూరల్: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని పార్టీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణయాదవ్ బుధవారం తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పార్టీ పరిస్థితులను జగన్‌మోహన్‌రెడ్డికి వివరించారు. ఆయన వెంట నాయకులు ఆవుల భాస్కర్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, తమ్మినేని ఉమా శంకర్‌రెడ్డి, స్వర్ణ ఏడుకొండలురెడ్డి, కత్తి యాదవ్, గోళ్ళిళ్ల శ్రీను, సీఎస్‌పురం మండల వైస్ ఎంపీపీ దుగ్గిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, భైరవకోన ఆలయ మాజీ చైర్మన్ సిద్దు రమణారెడ్డి, సిద్దు వెంకటరెడ్డి తదితరులు ఉన్నారు.

విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై

మద్దిపాడు: సోషల్ మీడియా ఎంత మంచిదో అంత ప్రమాదమని ఎస్సై రమేష్ బాబు అన్నారు. మండలంలోని గీతాంజలి స్కూల్‌లో విద్యార్థులకు సోషల్ మీడియాపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతో సోషల్ మీడియాలో మంచిని మాత్రమే విద్యార్థులు తీసుకోవాలని సూచించారు. మానవ జీవితంపై నేటి కాలంలో సోషల్ మీడియా ఎంతో ప్రభావితం చేస్తుందన్నారు. అనంతరం విద్యార్థులకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్‌పై అవగాహన కలిగి ఉండాలని, వాహనాలు నడిపే వారు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలన్నారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు జ్యోతిరావ్ పూలే వర్ధంతి

కనిగిరిరూరల్: వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో మహాత్మా జోతిరావ్ పూలే వర్ధంతిని గురువారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహం వద్ద ఉన్న పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్నట్లు ఆ పార్టీ కార్యాలయ ప్రతినిధి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 28న గురువారం ఉదయం 9.30 గంటలకు జరిగే కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ పాల్గొంటారని తెలిపారు. వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరు కావాలన్నారు.

అన్యాక్రాంత భూముల్లో సీసీరోడ్ల నిర్మాణం


దేవస్థానం భూముల్లో వేస్తున్న సీసీ రోడ్లు

పామూరు: అన్యాక్రాంతమైన ఆలయ భూముల్లో సీసీరోడ్ల నిర్మాణం ఏంటని ప్రజలు చర్చించుకుంటున్నారు. మండల కేంద్రమైన పామూరులోని నెల్లూరురోడ్డు సమీపంలో మదన వేణుగోపాలస్వామి ఆలయానికి సర్వేనంబర్ 380/1, 2 లలో 7.56 ఎకరాల భూమి ఉంది. ఇప్పటికే ఈ భూమిలో కొందరు అక్రమంగా నిర్మాణాలు చేపట్టారు. ప్రస్తుతం పంచాయతీ వారు అన్యాక్రాంతమైన ఆలయ భూముల్లో సీసీరోడ్ల నిర్మాణం చేపట్టడంపై పలు విమర్శలు వస్తున్నాయి. కాగా ఆలయ భూముల జాబితాను ఇప్పటికే పంచాయతీ ఈఓకు లిఖిత పూర్వకంగా అందజేసినట్లు ఈఓ ఎస్ జీఆర్ నరసింహబాబు తెలిపారు. ఇలా ఆలయ భూముల్లో సీసీరోడ్ల నిర్మాణం జరపడంపై ప్రజలు పలు అనుమానాలు వ్యక్తంచేస్తున్నారు.

రాజ్యాంగంపై అవగాహన ఉండాలి

ఉలవపాడు: రాజ్యాంగంపై విద్యార్థులకు అవగాహన ఉండాలని ఉపాధ్యాయులు శ్రీధర్, భాస్కర్, మస్తాన్‌వలి అన్నారు. బుధవారం మండల పరిధిలోని భీమవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులు చిన్నప్పటి నుంచే రాజ్యాంగంలోని హక్కుల గురించి తెలుసుకోవాలన్నారు. రాజ్యాంగం పుస్తకం తీసుకొని చదివి వాటిలోని అంశాలను అవగాహన చేసుకోవాలన్నారు. బీఆర్ అంబేద్కర్ ఈ దేశం కోసం ఎంతో కష్టపడి రాసిన రాజ్యాంగం అని, భారతీయులందరూ అంబేద్కర్‌కు రుణపడి ఉండాలన్నారు. తొలుత అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.